నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | MEDAK

కాంగ్రెస్ పాలనలో మత కలహాలు

మాజీమంత్రి హరీశ్‌రావు

విలేకరులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 17: తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో మత కలహాలు ఏర్పడి అత్యాచారాలు, హత్యలు పెరిగి శాంతిభద్రతలు లోపించాయని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం మెదక్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. తొమ్మిది నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 1900 అత్యాచారాలు, 206 హత్యలు జరిగాయన్నారు. ప్రతిపక్షాలపై కేసులు, ప్రతిపక్ష నేతల ఇండ్లపై, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడులు చేయిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లా అండ్ ఆర్డర్‌ను గాలికొదిలేసి పగ, ప్రతికారాలు తీర్చుకుంటందన్నారు. రాష్ట్రంలో మైనార్టీలకు, మహిళలకు భద్రత లేకుండా పోయిందని, ఎస్సీ,ఎస్టీ మహిళలపై సైతం అత్యాచారాలు నిత్యకృత్యమయ్యాయన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్ల మత విద్వేషాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మెదక్‌తోపాటు జైనూర్, వనపర్తి, దౌల్తాబాద్, చెంగిచెర్ల, నిజామాబాద్, రేవ్‌పూల్ ప్రాంతాల్లో మత కలహాలు జరిగినా ఇప్పటివరకు సీఎం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించలేదన్నారు. మొయినాబాద్‌లో మసీద్‌ను రియల్ మాఫీయా కూల్చివేసిందని, తొమ్మిది నెలల్లో నాలుగైదు మసీదులు కూలాయన్నారు. ఈ ఘటనలు హైదరాబాద్ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయన్నారు. మతకలహాలలో హిందూ, ముస్లింల ఆస్తులు నష్టపోయాయని వారికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి బడ్జెట్ కేటాయించి బాధితులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మతకలహాల వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతుందని, అలాంటి ప్రాంతాల్లోని పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నేటివరకు ఫీస్ మీటింగ్ పెట్టకుండా బాధితులకు భరోసా కల్పించకుండా ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి మత కలహాలు జరుగలేదన్నారు. మైనార్టీ పాఠశాల మెస్‌చార్జీలు ఇవ్వడం లేదన్నారు. అసెంబ్లీలో చెప్పిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌ను ఎందుకు ఖర్చుపెట్టడం లేదన్నారు. మైనార్టీ మినిష్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాల ద్వారా నగదుతో పాటు తులం బంగారం అందజేస్తానన్న ముఖ్యమంత్రి మాటలు ఏమయ్యాయని హరీశ్‌రావు ప్రశ్నించారు.సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, జయరాజ్, బీఆర్ఎస్ నాయకులు లింగారెడ్డి, ప్రభురెడ్డి, కృష్ణాగౌడ్, శంకర్, జుబేర్, సాయిలు, ప్రభులింగం, కిషన్, కిరణ్, మల్లేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో గాంధీలు పోయి గాడ్సేలొచ్చారు..

విలేకరులతో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

- రేవంత్‌కు సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష
- హైదరాబాద్‌లో హైడ్రాతో డ్రామాలు
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రాజీవ్ విగ్రహం తరలింపు ఖాయం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబర్ 17: తెలంగాణ కోసం కేసీఆర్ ఉద్యమాలు, పోరాటాలు చేయడంతోనే నేడు ప్రత్యేక తెలంగాణ సిద్ధించిందని, రాష్ట్రం రాకపోతే తెలంగాణకు రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవాడా, కేసీఆర్ పెట్టిన భిక్షతోనే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడని, కాంగ్రెస్‌లో గాంధీలుపోయి గాడ్సేలొచ్చారని బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం శాశ్వతం కాదని, అహంకారంతో పోతే పాతాళంలోకి పోవడం ఖాయమన్నారు. అభినవ వల్లభాయ్ పటేల్‌లా కేసీఆర్ తెలంగాణ సాధిస్తే ఆయన మీద సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా నాలుక పారేసుకోవడం మంచిది కాదన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడే విధానం చూస్తే తులసివనంలో గంజాయి మొక్కలా ఉందన్నారు. తెలంగాణ సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం సరికాదని, అధికారంలోకి రాగానే రాజీవ్ విగ్రహం తలిగింపు ఖాయమన్నారు. నాడు సోనియాను బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి నేడు బలిదేవత భర్త విగ్రహాన్ని ఎలా పెడుతున్నడో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. హైడ్రా పేరుతో డ్రామాలు చేస్తూ ప్రభుత్వం వాటిని పక్కన పెట్టి పేద ప్రజల కోసం పని చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పారిశుధ్యం పడకేసిందని, దవాఖానల్లో మందుల కొరత ఏర్పడిందన్నారు. ప్రజలు ఛీకొడుతున్నా ప్రభుత్వం మాత్రం మేల్కొనడం లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, రాష్ట్ర నాయకుడు దేవీరవీందర్, మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్, మాజీ జడ్పీటీసీలు మల్లేశం, అర్జున్‌గౌడ్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, రజిత, బాల మణి, రహీం, కనకయ్య, నాయకులు యాదవరెడ్డి, నర్సింగరావు, ఉమార్ తదిత రులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

తెలంగాణ తల్లిని అవమానించిన రేవంత్

జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, సెప్టెంబర్ 17: హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ అబద్ధాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రుణమాఫీ కోసం ముందు రూ.40వేల కోట్లు అని చెప్పి, కేవలం రూ.17.900 కోట్లతో రుణమాఫీ చేశారని మండిపడ్డారు. ఇంతవరకు రైతు భరోసా ఊసేలేదన్నారు. కేసీఆర్ హయాంలో ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ, రైతుబంధు ఇచ్చారని గుర్తు చేశారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తరో జాబ్ క్యాలెండర్‌లో వివరించలేదని చెప్పారు. మెగా డీఎస్సీ, ఉద్యోగులకు టీఏలు, డీఏలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఖమ్మంలో భారీ వర్షాలకు నష్టపోయిన ప్రజలను ఆదుకోలేదన్నారు. కార్లలో తిరుగుతూ హాయ్ అన్నారే తప్పించి కిందకు దిగలేదని మండిపడ్డారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రజలు తిరగబడాలన్నారు. సచివాలయం దగ్గర తెలంగాణ తల్లి విగ్రహం పెట్టకుండా తెలంగాణకు ఎలాంటి సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండప్ప, పెంటారెడ్డి, మచ్చేందర్, సంజీవరెడ్డి, బండి మోహన్, రాకేశ్, అశోక్‌రెడ్డి, మోహియుద్దీన్, లవన్, ప్రవీణ్, హీరు రాథోడ్, చిన్నరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సంగారెడ్డిలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ అస్తిత్వాన్ని అవమానపరుస్తున్న కాంగ్రెస్

సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

సంగారెడ్డి, సెప్టెంబర్17: గాంధీ కుటుంబానికి తెలంగాణకు సంబంధం లేకున్నా సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం విడ్డూరమని మాజీ సీడీసీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు, సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ ఆదేశాలతో కలెక్టరేట్ ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ఎక్కడ ప్రశ్నిస్తారోనని బయపడి పక్కదోవ పట్టిస్తూ ఇలాంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని ఆరోపించారు. ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు చరమగీతం పాడి, లేనిపోని అంశాలను తెరపైకి తెస్తూ కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో జరగబోయే స్థానిక సమరంలో తగిన విధంగా ప్రజలే బుద్ధి చెపుతారన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానపరిచే విధంగా సచివాలయం ఎదుట తెలింగాణ తల్లి విగ్రహానికి బదులు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడాన్ని ప్రజలే ప్రశ్నిస్తున్నారన్నారు. చవకబారు మాటలు ఆపి ఇచ్చిన గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి నర్సింహులు, విఠల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మందుల వరలక్ష్మి, కసిని శ్రీకాంత్, నవీన్‌కుమార్, బత్తుల శ్రీనివాస్, శ్రావణ్‌రెడ్డి, ఎర్రోళ్ల చిన్నా, ఆజీమ్ పాల్గొన్నారు.

పోరాటయోధులు పుట్టిన గడ్డ తెలంగాణ

- బైరాన్‌పల్లి పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి
- బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి

బైరాన్‌పల్లి బురుజు వద్ద జాతీయజెండాను ఎగురవేసి వందనం చేస్తున్న బాలలక్ష్మి

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్17: తెలంగాణ అంటేనే పోరాటం..తెలంగాణ అంటేనే ఆత్మగౌరవం, తెలంగాణ చరిత్రను ప్రపంచం నలుదిశలా చాటిచెప్పే విధంగా పోరాటాలు చేసిన ఎంతోమంది పోరాటయోధులు పుట్టిన గడ్డ మన తెలంగాణ గడ్డ అని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి అన్నారు. మంగళవారం ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామాన్ని బీసీ కమిషన్ సభ్యురాలు సందర్శించి, గ్రామ నడిబొడ్డున ఉన్న చారిత్రక బురుజు, అమరవీరుల స్తూపాల వద్ద అమర వీరులకు నివాళులర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు. గ్రామంలోని సమరయోధులను, సమర యోధుల కుటుంబసభ్యులను ఆమె శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బాలలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలోని అనేక పోరాటాలకు బైరాన్‌పల్లి పోరాటం స్ఫూర్తినిచ్చినట్లు తెలిపారు. రజాకార్లకు వ్యతిరేకంగా ప్రాణాలను పణంగా పెట్టి బైరాన్‌పల్లి ప్రజలు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. బైరాన్‌పల్లి పోరాట చరిత్రను భవిష్యత్‌తరాలకు తెలియజేసేందుకు పాఠ్య పుస్తకాల్లో చేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ప్రాంతంలో పుట్టిన బిడ్డగా బైరాన్‌పల్లి పోరాట స్ఫూర్తితో ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా మలిదశ తెలంగాణ పోరాటంలో తాను ముఖ్య భూమికను పోశించినట్లు తెలిపారు. తన పోరాటానికి గుర్తుగా ప్రభుత్వం తనను బీసీ కమిషన్ సభ్యురాలిగా నియమించినట్లు తెలిపా రు. అంతకుముందు బాలలక్ష్మికి ధూళిమిట్ట తహసీల్దార్ పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, సీని నిర్మాత జైహింద్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీలు గిరి కొండల్‌రెడ్డి, కొమ్ము నర్సింగరావు, మాజీ సర్పంచ్‌లు బండి శ్రీనివాస్, కూకట్ల బాలరాజు యాదవ్, సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్17: సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించాల్సిన స్థలంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ మెదక్ జిల్లా కార్యాలయ ఆవరణలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

గజ్వేల్‌లో తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబర్ 17: జాతీయ సమైఖ్యత దినోత్సవంలో భాగంగా మంగళవారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ ఇన్‌చార్జీ వంటేరు ప్రతాప్‌రెడ్డి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ సాధనలో ఎంతో మందిని బలి తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం నేడు సచివాలయం ఆవరణలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై తెలంగాణ సమాజం సిగ్గుపడుతుందన్నారు. ఆనాటి తొలి దశ ఉద్యమం నుంచి మలిదశ ఉద్యమం వరకు ఎంతో మందిని కాంగ్రెస్ ప్రభుత్వం బలి తీసుకుందన్నారు. కేసీఆర్‌పై ఇష్టానుసారంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడే బాషను మార్చుకోవాలని తెలంగాణ సమాజం ఆయన బాషకు తలదించుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, నాయకులు కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మధు, నవాజ్, శ్రీనివాస్ తదిత రులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లిని అవమానించిన ప్రభుత్వం

సంగారెడ్డి, సెప్టెంబర్17: తెలంగాణ తల్లిని అవమానించేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని, సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం సిగ్గుమాలిన చర్య అని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టే సిగ్గుమాలిన చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టుకుంటే అభ్యంతరం లేదని, తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సొంత డబ్బా కొట్టుకునేందుకు సమయం ఇస్తున్న ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఇప్పటికే రుణమాఫీ విషయంలో అన్నదాతల ఆగ్రహానికి గురైన విషయం తెలిసిందేనని గుర్తు చేశారు. మీడియా సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, మాజీ సడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నాయకులు కల్వకుంట నర్సింగ్‌రావు. జలేందర్, సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

మార్పు అంటే..ఇదేనా..!

- జాతీయ జెండాను అవమానించిన కాంగ్రెస్ నేతలు
- సిద్దిపేట జిల్లా వీరన్నపేటలో కాంగ్రెస్ జెండాపైపుకు జాతీయ జెండాను కట్టిన వైనం

కాంగ్రెస్ సింబల్ కలిగిన రాడ్‌కు కట్టిన జాతీయ జెండాను ఎగురవేస్తున్న వీరన్నపేట కాంగ్రెస్ నేతలు

చేర్యాల, సెప్టెంబర్17: మార్పు.. మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చిత్ర విచిత్రమైన చర్యలతో జనంలో అబాసుపాలవుతుంది. ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా చేర్యాల మండలంలోని వీరన్నపేటలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సింబల్‌తో కూడిన ఇనుప రాడ్‌కు కాంగ్రెస్ నేతలు జాతీయ జెండాను కట్టి జెండావిష్కరణను చేశారు. జాతీయ జెండాను సరిచేయాలని పలువురు చెప్పినా వారు పట్టించుకోకపోవడం గమనార్హం.

అందరికీ సమాన అవకాశాలు

- సిద్దిపేట జిల్లాలో 2 కోట్ల 72 లక్షల మంది మహిళ లకు ఉచిత రవాణా
- ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు
- జిల్లాలో మూడు విడతల్లో రూ.839 కోట్ల పంట రుణమాఫీ
- రవాణా,బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- సిద్దిపేటలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

సిద్దిపేటలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్, ఎస్పీ

సిద్దిపేట, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ, అడిషనల్ కలెక్టర్లు గరిమాఅగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ..సిద్దిపేట జిల్లాలో గత డిసెంబర్‌లో 8 రోజులు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 25 వేల 214 దరఖాస్తులు స్వీకరించామన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రతి మండలం, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసి ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు, కొత్త దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించామని చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా 88 కోట్ల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారని చెప్పారు. తద్వారా మహిళలకు రూ. 2,991 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటి వరకు 2 కోట్ల 72 లక్షల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాలు ఉపయోగించుకున్నారని, దీంతో వారికి రూ.100 కోట్ల 39 లక్షల లబ్ధి చేకూరిందని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పగడ్బందీగా అమలు చేయడంతోపాటు ఈ పథకం కింద పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకం వల్ల జిల్లాలో 17 వేల 261 మంది పేదలు చికిత్స పొందగలిగారన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.38 కోట్ల 44 లక్షల ఖర్చు చేస్తుందని చెప్పారు.

మూడు విడతల్లో రూ.839 కోట్ల రుణమాఫీ

సిద్దిపేట జిల్లాలో మూడు విడతల్లో రుణమాఫీకి అర్హులైన లక్షా 2 వేల 75 మంది రైతులకు రూ.839 కోట్లు జమ చేశామని మంత్రి పొన్నం తెలిపారు. మహిళలందరినీ ఐదేండ్లలో కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ జీవనోపాధి పెంపొందించే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళాశక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంలో భాగంగా మైక్రో ఎంటర్‌ప్రైజెస్, డైయిరీ, స్టిచ్చింగ్, పౌల్ట్రీ మదర్ యూనిట్స్, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ యూనిట్స్, ఫిష్ రిటైల్ అవుట్లెట్ యూనిట్స్, మిల్క్ పార్లర్ యూనిట్స్, మీసేవ సెంటర్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్స్, మహిళా శక్తి క్యాంటీన్, సోలార్ యూనిట్స్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్స్, కష్టం హైరింగ్ సెంటర్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 2024-25 సంవత్సరానికి 18 వేల 788 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.165 కోట్లతో జీవనోపాధి కల్పించడానికి ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేస్తున్నామని చెప్పారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, శాంతిభద్రతల నిర్వహణకు అహర్నిశలు కృషిచేస్తున్న పోలీసు యంత్రాంగానికి, వైద్యులకు, పారిశుధ్య కార్మికులకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలో మహనీయుల చిత్రపటాలకు నమస్కరిస్తున్న మంత్రి పొన్నం

ప్రతిఒక్కరికీ సొంతింటి కలను నిజం చేస్తాం

ప్రతిఒక్కరికీ సొంతింటి కలను నిజం చేయాలని ప్రభుత్వం భావిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు పరుస్తుందన్నారు. ఈ పథకం కింద ఈ సంవత్సరంలోనే 4 లక్షల 50 వేల గృహాలు నిర్మించతలపెట్టామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 గృహాలు నిర్మిస్తామని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద కేవలం రూ.500లకే వంట గ్యాస్ సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ పథకం కింద జిల్లాలో లక్ష 67 వేల 872 మందికి లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఇప్పటివరకు లక్ష 65 వేల 912 మంది వినియోగదారులకు 3 లక్షల 23 వేల 12 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. దీనికి ప్రభుత్వం రూ.9 కోట్ల 24 లక్షల సబ్సిడీ అందించిందన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ప్రభు త్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుంది. జిల్లాలో ఇప్పటివరకు లక్ష 89 వేల 806 కుటుంబాలకు లబ్ధి చేకూరింది.

ప్రజాపాలనలో ఒరిగిందేమి లేదు

దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్,సెప్టెంబర్ 17:ప్రజాపాలనతో ప్రజలకు ఒరిగిందేమిలేదని, సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా వైఫల్యం చెందిదని బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన ఎల్కల్‌లో విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీలో నిధులు లేక గ్రామల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేవారు కరువైపోయారని, ప్రభుత్వం తక్షణమే పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్యారెంటీలు అమలు చేసే వరకు ప్రజలు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. రైతులకు రూ.రెండు లక్షల రుణామాఫీ చేసి రైతు బంధు నిధులు విడుదల చేయాలని, లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాల్సి ఉంటుందన్నారు. సీఎం హైడ్రా పేరుతో పేదల ఇండ్లను తొలిగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాల్సిందిపోయి, రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టి తెలంగాణ అత్మగౌరవాన్ని దెబ్బ తీశాడన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆస్తి కోసం తండ్రిని హతమార్చిన కొడుకు

ఝరాసంగం, సెప్టెంబర్ 17:ఆస్తి కోసం తండ్రిని కుమారుడు హతమార్చిన ఘటన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని బర్దిపూర్‌లో జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన తెలుగు మారుతి(75)కి నలుగురు అబ్బాయిలు, ఒక అమ్మాయి సంతానం. రెండో కుమారుడు శ్రీనివాస్ కుప్పానగర్ శివారులో ఉన్న భూమిలో తనకు వచ్చి